


సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణం

పెదలంక(భట్టిప్రోలు): పెదలంకలో కొలువైన వల్లీ దేవసేన సుబ్రహ్మణేశ్వరస్వామి వారి కల్యాణ మహోత్సవాలు గురువారం జరిగాయి. స్వామి వార్లను పురవీధుల్లో ఊరేగించారు.



పోలింగ్ స్టేషన్లలో వసతుల కల్పన

ప్రత్తిపాడు: పోలింగ్ స్టేషన్లలో అన్ని వసతులు కల్పిస్తామని తహసీల్దార్ జి.రాఘవేంద్రరావు అన్నారు. ఈదులపాలెం, యనమదల, నడింపాలెం, తుమ్మలపాలెం స్టేషన్లు పరిశీలించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 517.40 అడుగుల వద్ద ఉంది. ఎస్ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

సేవకు సెల్యూట్

వలంటీర్లకు వందనం కార్యక్రమానికి పోటెత్తిన అభిమాన'జనం'

వలంటీర్లను అవార్డులతో సత్కరించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి | కార్మెల్ మాత కొండ ఘాట్ నిర్మాణానికి రూ. 39 కోట్లు మంజూరు

ఎండనక..వాననక..రేయనక..పగలనక..పథకం ఏదైనా ప్రజలకు అందజేయడమే వారి లక్ష్యం.. నిస్వార్థంగా సేవ చేయడమే వారికి తెలుసు.. చివరకు ప్రజలకు తలలో నాలుకలా మారారు.. వారే వలంటీర్లు. వారి సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను ఇచ్చి గౌరవిస్తున్నారు.



బటన్ నొక్కి నగదు జమ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వేదికపై మంత్రులు రజిని, ఆదిమూలపు, ఎంపీ నందిగం తదితరులు



విజయ చిహ్నంగా గద చూపుతున్న సీఎం వైఎస్ జగన్, పక్కన ఎమ్మెల్యే సుచరిత

సాక్షిప్రతినిధి,గుంటూరు/తాడికొండ/పట్నంబజార్: అభిమానం పోటెత్తింది. నాలుగేళ్ల కిందట ఏర్పాటైన ముఖ్యమంత్రి మానసపుత్రిక అయిన వలంటీర్ల వ్యవస్థ నేడు ప్రజల గుండెల్లో గూడుకట్టుకున్న వేళ .. వలంటీర్లకు వందనం పేరుతో నిబద్ధతతో పనిచేసిన వలంటీర్లకు అవార్డులు అందచేసే కార్యక్రమానికి తాడికొండ నియోజకవర్గం ఫిరంగిపురం వేదిక అయ్యింది. ఫిరంగిపురం శివారు రేపూడిలో గురువారం నిర్వహించిన 'వలంటీర్లకు వందనం' కార్యక్రమానికి జనాభిమానం పోటెత్తింది. వలంటీర్లు, ప్రజలు, కార్యకర్తలు, నాయకులు స్వచ్ఛందంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

- సాయంత్రం 3.20 గంటలకు హెలికాప్టర్‌లో ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉన్న హెలిప్యాడ్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాలరెడ్డి, మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని, ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ లేళ్ల అప్పిరెడ్డి, జిల్లా ముఖ్య నేతలు, నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి ఘనస్వాగతం పలికారు.
- ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రత్తిపాడు ఎమ్మెల్యే, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త మేకతోటి సుచరిత కుటుంబ సమేతంగా వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి ఘనస్వాగతం పలికారు. సీఎంకి తన కుమార్తె, కుమారుడు, మనుమడిని ఆమె పరిచయం చేశారు.
- పది నిమిషాలపాటు కార్యకర్తలను పరిచయం చేసుకున్నారు. అనంతరం సీఎం ప్రత్యేక బస్సులో సభాస్థలికి బయల్దేరారు. అడుగడుగునా గులాబీ పూల వర్షం కురిపించారు. సభాస్థలికి చేరుకున్న అనంతరం నాయకులు, కార్యకర్తలకు సీఎం అభివాదం చేస్తుండగా, అభిమానుల కేరింతలు మిన్నంటాయి.
- వలంటీర్లు దాసరి జోత్స్న, షేక్ జుబేర్‌లు మాట్లాడుతూ వలంటీరు వ్యవస్థ ద్వారా తాము అందిస్తున్న సేవలకుగాను ప్రభుత్వం ప్రోత్సహించి అభినందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇంటింటికి వెళుతున్నప్పుడు పెన్షన్‌దారుల నుంచి వచ్చే దీవెనలు మాకెంతో ఆనందాన్ని ఇస్తున్నాయని, అందరి జీవితాల్లో వెలుగులు నింపిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థకే ఉన్నత స్థానం కల్పించారని కొనియాడారు.

హోరెత్తిన నినాదాలు

4.30 గంటలకు సీఎం వై.ఎస్.జగన్ తన ప్రసంగాన్ని ప్రారంభించి 5.25 గంటల వరకు కొనసాగించారు. సీఎం ప్రసంగం కొనసాగుతున్నంత సేపు ప్రజలు, వలంటీర్లు, జై జగన్, సీఎం ..సీఎం.. సీఎం అంటూ నినాదాలతో హోరెత్తించారు. సీఎం తన ప్రసంగంలో భాగంగా చివరగా ఫిరంగిపురం కార్మెల్‌మాత కొండ ఘాట్ రోడ్డు నిర్మాణానికి రూ.39 కోట్లు మంజూరు చేయడంతోపాటు, రాజధానిలో భూమి లేని నిరుపేదలకు అందిస్తున్న జీవన భృతి పెన్షన్‌ను రూ.5వేలకు పెంచుతున్నట్లు ప్రకటించగానే సభా ప్రాంగణం నినాదాలతో మారు మోగిపోయింది.



పకడ్బందీ ఏర్పాట్లు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫిరంగిపురం మండల పర్యటనను పురస్కరించుకుని పోలీసులు, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. తాగునీరు, అల్పాహారం, అందరికీ సకాలంలో అందించారు. కార్యక్రమంలో మంత్రులు అంబటి రాంబాబు, విడదల రజిని, ఆదిమూలపు సురేష్, బూడి ముత్యాలనాయుడు, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధర్మాన ప్రసాదరావు, శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యేలు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, అన్నాబత్తుని శివకుమార్, కిలారి వెంకట రోశయ్య, కాసు మహేష్‌రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్సీలు మురుగుడు హనుమంతరావు, తలశిల రఘురామ్, పోతుల సునీత, కల్పలతారెడ్డి, గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త ఉమ్మారెడ్డి వెంకటరమణ, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు, మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, జిల్లా పార్టీ అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్, ప్రత్తిపాడు, గుంటూరు తూర్పు, మంగళగిరి నియోజకవర్గాల సమన్వయకర్తలు బలసాని కిరణ్‌కుమార్, షేక్ నూరిఫాతిమా, గంజి చిరంజీవి, ఏపీ ప్రభుత్వ సలహాదారు బత్తుల బ్రహ్మానందరెడ్డి, మచిలీపట్నం పోర్టు ట్రస్టు ఎండీ మేకతోటి దయాసాగర్, పలు కార్పొరేషన్‌ల చైర్మన్‌లు పఠాన్ ముంతాజ్, ఎం పురుషోత్తం, కోలా భవానీ, ఎం శేషగిరిరావు, పానుగంటి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేనివి..

మేకతోటి సుచరిత, ఎమ్మెల్యే

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన విప్లవం వలంటీర్ల వ్యవస్థ. వారి ద్వారా ప్రజలకు సేవలందించటం సంతోషదాయకం. వలంటీర్లపై అవాకులు, చవాకులు మాట్లాడిన పరిస్థితులను రాష్ట్రమంతా చూశారు. వ్యాఖ్యలు చేసిన నోటితోనే శభాష్ అనేలా పరిపాలన అందేలా చేశారు. ప్రతి నెలా 1వ తేదీన చక్కని చిరునవ్వుతో అవ్వతాతలకు వలంటీర్లు పింఛన్‌లు అందజేస్తూ...వారి కుటుంబ సభ్యులుగా మారిపోయారు. ఏదైనా అత్యవసర పరిస్థితులు ఉంటే.. వృద్ధులు ఆఖరికి వారికి ఫోన్ చేసి చెప్పుకునే పరిస్థితులు ఏర్పడటం అభినందనీయం. కోవిడ్ కల్లోల సమయంలో సైతం, కుటుంబ సభ్యులు పట్టించుకోని పరిస్థితుల్లో కూడా, వలంటీర్లు వారి కుటుంబాలను వదిలిపెట్టి, ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సమాజ శ్రేయస్సు కోసం పాటుపడ్డారు. రాష్ట్రంలో ఉద్యోగ విప్లవంతో పారదర్శకంగా వలంటీర్ల సైన్యాన్ని ఏర్పాటు చేసిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుంది. రాజధాని ప్రాంతంలో నిరుద్యోగ భృతి రూ 3వేలు ఇస్తున్నారు.. దానిని రూ 5వేలు చేయాలని సీఎం జగనన్నను కోరుతున్నాను. ఫిరంగిపురంలోని కార్మెల్‌మాత చర్చికి సంబంధించి ఘాట్ రోడ్డు ఏర్పాటు చేయాలని విన్నవిస్తున్నా.

ప్రభుత్వం.. ప్రజలకు మధ్య వారధి

ఎం.వేణుగోపాలరెడ్డి, జిల్లా కలెక్టర్

దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రజలకు సేవలు అందించాలనే ఉద్దేశంతో ఏర్పాటుచేసిన వ్యవస్థ వలంటీర్లు. అవినీతికి తావులేకుండా పారదర్శకంగా ప్రజలకు వద్దకు సంక్షేమాన్ని తీసుకుని వెళ్తున్న వలంటీర్లు అభినందనీయులు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధుల్లా పనిచేస్తూ.. ముందుకు సాగుతున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను ముందుకు తీసుకుని వెళ్తూ.. పరిపాలన మరింత సులభతరం చేస్తూ.. ప్రతి అంశంలో పేదవర్గాలకు వలంటీర్లు సేవలందిస్తున్నారు. సంక్షేమ క్యాలెండర్ ద్వారా ఎప్పుడు ఏ పథకం వస్తుందో తెలియజేస్తూ..ప్రతి పథకాన్ని ప్రజలకు వివరించటం అభినందనీయం. జిల్లాలో 11.087 మంది వలంటీర్లకుగాను 10,552 మందికి సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారాలు వచ్చాయి. శుక్రవారం నుంచి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పండుగ వాతావరణంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తాం.



థ్యాంక్యూ జగనన్న అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళలు



వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తదితరులు

న్యూస్‌రీల్

19 మందికి హెడ్ నర్సులుగా ఉద్యోగోన్నతి



గుంటూరుమెడికల్ : ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో స్టాఫ్‌నర్సులుగా పనిచేస్తున్న 19 మందికి గుంటూరు ఆర్డీ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించి హెడ్‌నర్సులుగా ఉద్యోగోన్నతి కల్పించారు. కౌన్సెలింగ్‌కు 20 మందిని పిలువగా, ఒకరు ఉద్యోగోన్నతి వద్దని లిఖితపూర్వకంగా లేఖ ఇచ్చారు. ఆర్డీ డాక్టర్ జి.శోభారాణి, డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్, సూపరింటెండెంట్ సుధీర్, సీనియర్ అసిస్టెంట్ షేక్ నాగూర్ షరీఫ్ కౌన్సెలింగ్ ప్రక్రియలో పాల్గొన్నారు.

యోగా గురువు పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ఆవరణంలోని ప్రభుత్వ యునాని, న్యాచురోపతి యోగ వైద్యశాలలో యోగా గురువుగా పనిచేసేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డాక్టర్ రావూరి మౌనిక తెలిపారు. యోగాలో పీజీ, లేదా డిప్లమోలో అనుభవం ఉన్నవారు అర్హులని పేర్కొన్నారు. మహిళా అభ్యర్థులు యోగా గురువులుగా పనిచేసేందుకు కావాలన్నారు. మహిళ యోగా గురువుకు ప్రతిరోజూ గంటకు రూ. 250 చొప్పున, 20 గంటలకు నెలకు గౌరవ వేతనంగా రూ. 5వేలు అందిస్తారన్నారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు 8309599643 నంబరులో సంప్రదించాలని యునాని వైద్యురాలు డాక్టర్ మౌనిక కోరారు.

సోమేశ్వరస్వామి దేవాలయానికి శంకుస్థాపన



బాపట్ల: బాపట్ల పట్టణంలోని సోమేశ్వరస్వామి దేవాలయం శంకుస్థాపన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కోన రఘుపతి నిర్వహించా రు. గురువారం ఉదయం భక్తిశ్రద్ధలతో హోమం చేపట్టారు. ఆలయం ప్రధాన అర్చకులు బాబీ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కోన రఘుపతి, ఆయన సతీమణి రమాదేవిస్వామి వారికి అభిషేకాలు నిర్వహించి భక్తులకు స్వామి వారి చిత్రపటాలను అందించారు. కార్యక్రమంలో సోమేశ్వరస్వామి దేవాలయంలో కె.శివరామప్రసాద్, కొటికం సుబ్బారావు, వెదురుపర్తి లక్ష్మణమూర్తి, కొత్రా లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు బంగారు రాళ్లహారం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు చిలకలూరిపేటకు చెందిన భక్తులు గురువారం బంగారు రాళ్ల హారాన్ని కానుకగా సమర్పించారు. చిలకలూరిపేటకు చెందిన నక్కా రమేష్‌బాబు, కోటేశ్వరమ్మ దంపతులు అమ్మవారిని దర్శించుకునేందుకు ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. సుమారు 61.8 గ్రాముల బంగారం, రాళ్లతో తయారు చేయించిన హారాన్ని ఆలయ ఈఈ కోటేశ్వరరావుకు అందజేశారు. అమ్మవారి ఉత్సవాల్లో ఈ హారాన్ని వినియోగించాల్సిందిగా దాతలు ఆలయ అధికారులను కోరారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం భాగ్యం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

యార్డుకు 1,24,248 బస్తాల మిర్చి

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,24,248 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,19,823 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,000 నుంచి రూ. 20,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.8,000 నుంచి 21,500 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.13,000 వరకు ధర పలికింది.

ఇంటి నుంచే ఓటేద్దాం..!

దివ్యాంగులు, వయోవృద్ధులకు మాత్రమే..

- పోలింగ్ శాతం పెంపునకు ఎన్నికల సంఘం సంస్కరణలు
- అర్హులైన వారు ఫారం–12డీ ద్వారా ఈఆర్వోకు దరఖాస్తు
- జిల్లాలో 26,083 మంది దివ్యాంగులు, 25,648 మంది వయోవృద్ధులు

సత్తెనపల్లి: దివ్యాంగులు, వయోవృద్ధులకు ఎన్నికల కమిషనర్ బంపర్ ఆఫర్ ఇచ్చింది. పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయాలంటే ఇబ్బందులు పడేవారు. అందుకు స్థానికంగా నాయకులు ఘర్షణ పడిన సందర్భాలు అనేకం చూశాం. వీరి కష్టాలను గుర్తించిన కేంద్ర ఎన్నికల సంఘం రాబోయే ఎన్నికల్లో వీరు ఇంటి వద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునే ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం మొబైల్ ఓటింగ్ వాహనాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు.

జిల్లాలో ఇలా...

జిల్లాలో చిలకలూరిపేట, పెదకూరపాడు, సత్తెనపల్లి, నరసరావుపేట, వినుకొండ, గురజాల, మాచర్ల నియోజకవర్గాల పరిధిలో 17,12,829 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 8,37,200 మంది పురుషులు, 8,75,433 మంది మహిళలు, 196 మంది ఇతరులు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 26,083 మంది దివ్యాంగులు, 25,590 మంది 80 సంవత్సరాలు పైబడిన వయోవృద్ధులు, 58 మంది వందేళ్లు నిండిన వయోవృద్ధులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు.



దూళ్లపాళ్ల 114 పోలింగ్ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ర్యాంప్

ఫారం–12డీతో దరఖాస్తు...

దివ్యాంగులు, 80 సంవత్సరాల వయస్సు పైబడిన వయోవృద్ధులు ఇంటి వద్దనే మొబైల్ ఓటింగ్ వాహనం ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవాలంటే ముందుగా ఫారం–12డీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. కేంద్రాల వద్ద ఉన్న బీఎల్‌ఓల ద్వారా ఈఆర్వోకు దరఖాస్తు అందించాలి. అర్హులైన వారికి మొబైల్ ఓటింగ్‌లో అవకాశం కల్పిస్తారు.

నూతన విధానంలో...

- ఫారం–12డీ దరఖాస్తుల జాబితాను నియోజకవర్గ ఎలక్ట్రోరల్ రిజిస్ట్రేషన్ అధికారి(ఈఆర్వో) స్థాయిలో రూపొందిస్తారు.
- ఫారం–12డీ ద్వారా ఓటు వేసేందుకు దరఖాస్తు చేసుకున్న ఓటరుకు ఓటు ఏ రోజు వేయాలో ముందుగానే అధికారులు సమాచారం ఇస్తారు.
- ఓటరు రహస్యంగా బ్యాలెట్ పేపర్ పై ఓటేసేలా ఏర్పాటు చేస్తారు. ఈ ప్రక్రియ అంతా వీడియో గ్రాఫర్ సహాయంతో చిత్రీకరిస్తారు.
- ఆ ఓటును సీల్ చేసిన అనంతరం స్థానిక తహసీల్దారు కార్యాలయం ద్వారా రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి తరలిస్తారు.

ఎన్నికల సంఘం నిర్ణయం అభినందనీయం



దివ్యాంగుల కష్టాలను దృష్టిలో ఉంచుకొని ఎన్నికల సంఘం ఇంటి వద్దనే ఓటు వేసే విధంగా మొబైల్ ఓటింగ్ వాహనాన్ని అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయం. ఈ విధానంతో దివ్యాంగులు వంద శాతం ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంది. శరీరం సహకరించని చాలా మంది ఓటు హక్కు వినియోగించుకోలేకపోతున్నా రు.

–మంగళగిరి రాజశేఖర్, అధ్యక్షుడు, వికలాంగుల హక్కుల పోరాట సమితి, పల్నాడు

ఇంటి వద్ద ఓటేసేలా చర్యలు



దివ్యాంగులు, వయోవృద్ధులు ఇంటి వద్దనే ఓటు వేసే అవకాశం ఎన్నికల సంఘం కల్పిస్తుంది. దివ్యాంగులు, 80 సంవత్సరాలు దాటిన వయోవృద్ధులు, నడవలేని స్థితిలో ఉన్నవారు కొందరు ఓటు హక్కు వినియోగించుకోవడం లేదు. అలాంటి వారు ఇంటి వద్ద ఓటేసేలా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. అర్హత కలిగిన వారు ఫారం–12డీ ద్వారా బీఎల్‌ఓల నుంచి దరఖాస్తులు అందించాలి.

– వి.మురళీకృష్ణ, ఆర్డీఓ, సత్తెనపల్లి

కనులపండువగా సుబ్బారాయుడి రథోత్సవం

మోపిదేవి: మోపిదేవి శ్రీ వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో మూడో రోజు గురువారం రాత్రి స్వామివారి రథోత్సవం కనుల పండువగా నిర్వహించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు దంపతులు ఉత్సవాన్ని ప్రారంభించారు. స్వామివారిని ఊరేగింపుగా రథం వరకు తీసుకొచ్చారు. తొలుత ఆలయ ఏసీ ఎన్ సూర్య చక్రధరరావు ఆధ్వర్యంలో ప్రధానార్చకులు బుద్దు పవన్‌కుమార్ శర్మ, వేద పండితులు కొమ్మూరి ఫణికుమార్ శర్మ బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు చేశారు. అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ నేతృత్వంలో ఎస్ఐ వైవీవీ సత్యనారాయణ భారీ పోలీస్ బందోబస్తు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఈ ప్రాంతంలో సందడి నెలకొంది. తీన్‌మార్, డప్పు కళాకారులు, వేషధారుల సందడితో అర్ధరాత్రి వరకు రథోత్సవం కొనసాగింది. సాయంత్రం 4 గంటలకు ఆలయ ప్రాంగణంలో తెనాలికి చెందిన ఓలేటి శ్రీనివాసరావు భక్తిరంజని కార్యక్రమం ఆకట్టుకుంది. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గరికిపాటి వెంకటేశ్వరరావు, సర్పంచి నందిగం మేరీరాణి, సీఐలు నాగప్రసాద్, త్రినాథ్, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మార్చి 2 నుంచి ఎడ్ల బలప్రదర్శన

రెంటచింతల: మహాశివరాత్రి పురస్కరించుకుని జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగు ప్రదర్శన పోటీలు మార్చి 2 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు పులి ఓబుల్‌రెడ్డి, బరువు శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆశీస్సులతో, వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగ ఉపాధ్యక్షులు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి సారథ్యంలో సత్రశాలలో ఏర్పాటు చేసినట్లు చెప్పారు. గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానం సమీపంలోని అఖిలభారత రెడ్ల కుల గురువు శ్రీ శివభక్త కుంటి మల్లారెడ్డి అన్నదాన సత్రం మైదానంలో ప్రదర్శన పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 6 విభాగాలకు గాను ఒక్కొక్క విభాగంలో 7,8 బహుమతులు చొప్పున 44 బహుమతుల ద్వారా రూ.11 లక్షలు విజేతలైన రైతులకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9908775005, 8106183818, 8096154409, 9704005849లో సంప్రదించాలని కోరారు. సమావేశంలో కమిటీ సభ్యులు పత్తి కోటిరెడ్డి, యర్రెద్దుల శ్రీనివాసరెడ్డి, గోగుల వెంకటేశ్వర రెడ్డి, ఆరికట్ల కాశిరెడ్డి, గాదె వీరారెడ్డి, గొట్టం సైదారెడ్డి, జక్కిరెడ్డి అంజిరెడ్డి, లింగిరెడ్డి కోటిరెడ్డి, గాదె బ్రహ్మారెడ్డి, చింతా శివారెడ్డి, తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తులు

అచ్చంపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టి.అరుణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 80 సీట్లు, ఇంటర్ ఎంపీసీ 40 సీట్లు, బైపీసీ 40 సీట్లు ఉన్నట్లు చెప్పారు. ఐదో తరగతిలో ఎస్సీలకు 60 సీట్లు, బీసీలకు 14 సీట్లు, ఎస్టీలకు 5 సీట్లు, ఓసీకి ఒక సీటు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇంటర్‌లోనూ ఇదే రేషియోలో సీట్లు కేటాయించడం జరుగుతుందని వివరించారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాలకు చెందిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందని వెల్లడించారు. దరఖాస్తులను మార్చి 10లోగా www://apfpcet.apcf.rr.in అనే వెబ్‌సైట్ ద్వారా గాని, లేక స్థానిక గురుకుల పాఠశాలలో దదరఖాస్తులు పూర్తి చేసి ఇవ్వడం ద్వారా గాని దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 4వ తరగతి, టెన్త్ చదివే విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. పూర్తి వివరాలకు స్థానిక గురుకుల పాఠశాల ఫోన్ నంబర్లు 9059660634, 9866689812 కు ఫోను చేసి తెలుసుకోవచ్చని ప్రిన్సిపాల్ అరుణ్‌కుమార్ వివరించారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి రజిని, ఎమ్మెల్యే సుచరిత, చిత్రంలో డాక్టర్ ఉమ్మారెడ్డి



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వలంటీర్లు, అభిమానులు



సభకు తరలివస్తున్న ప్రజలు, వలంటీర్లు

జగనన్నే స్ఫూర్తి – సేవా దృక్పథమే దీప్తి

రేపూడి సభకు తరలివచ్చిన వలంటీర్లు, ప్రజలు

ఫిరంగిపురం: మండలంలోని రేపూడి గ్రామ శివారులోని పీఏసీ అండ్ విజయ్ ఇంజినీరింగ్ కళాశాల ఎదురుగా గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈసభకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు హాజరయ్యారు. సభకు గుంటూరు, బాపట్ల, పల్నాడు, జిల్లాల నుండేకాక వివిధ ప్రాంతాలనుంచి పెద్ద ఎత్తున వలంటీర్లు హాజరయ్యారు. కాగా పలువురు సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులకు ఎంపికయ్యారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో తామంతా వలంటీర్లుగా పనిచేసేందుకు ముందుకు వచ్చామని వలంటీర్లు వెల్లడించారు. ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఇంటిముంగింటకు చేర్చుతూ జగనన్న సైనికుల్లా పనిచేస్తామని చెప్పారు. పారితోషకం గురించి పట్టించుకోకుండా సేవాభావం తమ లక్ష్యమని తెలిపారు. పథకాల అమలులో అర్హులను గుర్తించి వారికి ప్రభుత్వం ఇచ్చే లబ్ధిని చేకూర్చడం తమకు ఎంతో సంతోషాన్ని ఇస్తుందని తెలిపారు. ఏటా ప్రభుత్వం, జగనన్న తమసేవలను గుర్తించి సేవావజ్ర, సేవారత్న, సేవామిత్రల వంటి అవార్డులు ఇచ్చి గౌరవించడం తమకు ఎంతో గర్వంగా ఉందన్నారు. రానున్న రోజుల్లో ఇదే స్ఫూర్తితో, ఉత్సాహంతో పనిచేస్తామని తెలిపారు. జగనన్న ఆశయాల సాధనే తమలక్ష్యమని రానున్న రోజుల్లో మరలా ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి రావాలని ఆకాంక్షించారు.

చెప్పలేని ఆనందంగా ఉంది



ఫిరంగిపురం సచివాలయం –1, 13వార్డుకు చెందిన నాకు సేవా వజ్ర ఇచ్చి గౌరవించడం ఎంతో ఆనందంగా ఉంది. అదీకాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా అవార్డు తీసుకోవడం మరింతగా సంతోషం వేసింది. ఇంకా కష్టపడి అర్హులకు పథకాలు అందేలా చేస్తాను.

– పి.వేళాంగిణి సుమ, ఫిరంగిపురం

జగనన్నకు వందనం



తెనాలి చిన్నరావూరితోట 14వార్డులో వలంటీరుగా పనిచేస్తాను. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్న నన్ను గుర్తించి టెస్టి మోనియల్‌లో సేవా రత్న అవార్డుకు ఎంపిక చేయడం ఆనందాన్ని ఇస్తుంది. సేవలు గుర్తించి అవార్డు అందించిన జగనన్నకు వందనం.

– సయ్యద్ మల్లిక, తెనాలి

పేదలకు సేవలందిస్తా



సత్తెనపల్లి గ్రామానికి చెందిన నేను వలంటీరుగా పనిచేస్తున్నా. అర్హులకు పథకాలు అందేలా చేయడం సంతోషాన్నిస్తుంది. సేవలను గుర్తించి సేవా మిత్ర అవార్డు ఇవ్వడం ఆనందాన్నిస్తుంది. మరలా జగన్‌మోహన్ సీఎం కావాలి. అవార్డు రావడం గర్వంగా ఉంది.

– వి.సాహితీ, సత్తెనపల్లి, పల్నాడు జిల్లా

జగనన్న సైనికుడిలా పనిచేస్తా



మంద్రు జయగోపాల్, పొన్నూరు, గుంటూరు జిల్లా పొన్నూరు మండలం నిడుబ్రోలు నాగుల చెరువులో వలంటీరుగా పనిచేస్తాను. నాకు సేవా రత్న రావడం గొప్పగా భావిస్తాను. అర్హులను గుర్తించి అందరికి పథకాలు అందేలా చేస్తూ జగనన్న సైనికుడిలా పనిచేస్తాను.

– మంద్రు జయగోపాల్. (పొన్నూరు)

గర్వంగా ఉంది



ప్రజలకు సేవలందిస్తున్న నన్ను గుర్తించి అవార్డుకు ఎంపిక చేయడం గర్వంగా ఉంది. పదిమందిలో గుర్తింపునిస్తుండం సంతోషాన్ని ఇస్తుంది. ప్రభుత్వ పథకాలు పేదలకు అందేలా చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమన్నారు.

– షేక్ జానీ బాషా, రెంటచింతల, పల్నాడు జిల్లా

జగనన్నతోనే వలంటీర్లకు గుర్తింపు



గుంటూరు అమరావతిరోడ్డు–2 సచివాలయంలో పనిచేస్తాను. ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేర్చడంతో నా పాత్ర ఎంతో కీలకంగా భావిస్తాను. అర్హులను గుర్తించి వారికి పథకాలు అందించడం సంతోషాన్నిస్తుంది. వార్డులో పనిచేసే మమ్మల్ని జగనన్న గుర్తించి సేవారత్న అవార్డు లందించడం ఆనందంగా ఉంది.

– కె.నిఖిల, గుంటూరు

అర్హులకు న్యాయం చేయడమే



జగనన్న ప్రభుత్వంలో అర్హులకు న్యాయం చేయడం లక్ష్యంగా పనిచేస్తారని ఆయన అడుగుజాడల్లో నడిచే మమ్మల్ని ప్రజలు ఎంతో గౌరవంగా చూస్తున్నారు.

– పి.శిరీష, తెనాలి

కష్టించి పనిచేస్తాం



ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేర్చడంలో జగనన్న సేవకులుగా కష్టించి పనిచేస్తాం. ఉదయాన్నే పింఛన్ దారులకు పింఛన్ అందించడం వారి కళ్లల్లో ఆనందం చూస్తే వలంటీరుగా చేస్తున్నందుకు గర్వంగా ఉంది.

– అమూల్య(ఫిరంగిపురం–1)

చందూస్ సిల్వర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ విజేత 'విజ్ఞాన్'



చేబ్రోలు: గుంటూరులోని జేకేసీ కళాశాల ఆధ్వర్యంలో అధ్యాపకుల కోసం ప్రతి ఏటా నిర్వహించే 27వ ఎడిషన్ 'చందూస్ సిల్వర్ కప్ క్రికెట్ టోర్నమెంట్' ఉల్లాసంగా సాగింది. విజ్ఞాన్ యూనివర్సిటీ వరుసగా రెండోసారి గెలిచి ట్రోఫీను నిలబెట్టుకుంది. జేకేసీ కళాశాలలోని క్రికెట్ గ్రౌండ్‌లో బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీ జట్టు నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల జట్టు మీద 94 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఫైనల్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన విజ్ఞాన్ నిర్ణీత 20 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 206 పరుగులు చేసింది. విజ్ఞాన్ బ్యాట్స్‌మెన్ ఎస్.వినోత్ 100(58 బంతుల్లో 10 ఫోర్లు, 4 సిక్స్‌లు) తో సెంచరీ సాధించాడు. మిగిలిన బ్యాట్స్‌మెన్‌లలో మాదినేని లోకేష్ (18బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్స్‌లతో) చివర్లో ఫోర్లు, సిక్స్‌లతో 47 పరుగులు చేశాడు. 207 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాల 15.4 ఓవర్లలో 112 పరుగులకు ఆలౌట్ అయింది. విజ్ఞాన్ బౌలర్లలో కెప్టెన్ శ్రీకాంత్ నల్లపనేని, మాదినేని లోకేష్‌లు చెరో మూడు వికెట్లు తీసి జట్టును విజయతీరాలకు చేర్చారు. టోర్నీలో బెస్ట్ బ్యాట్స్‌మెన్‌గా ఎస్.వినోత్ (విజ్ఞాన్స్ యూనివర్సిటీ), మ్యాన్ ఆఫ్ ద టోర్నమెంట్‌గా మాదినేని లోకేష్ (విజ్ఞాన్స్ యూనివర్సిటీ), టోర్నీలో బెస్ట్ బౌలర్‌గా కెప్టెన్ శ్రీకాంత్ నల్లపనేని (విజ్ఞాన్ వర్సిటీ) నిలిచారు. విజేతల బహుమతి ప్రదానానికి ముఖ్య అతిథిగా హాజరైన జేకేసీ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జాగర్లమూడి మురళీమోహన్ చేతుల మీదుగా కెప్టెన్ నల్లపనేని శ్రీకాంత్ ట్రోఫీను అందుకున్నారు. విజేతలను గురువారం విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ అభినందించారు.

లీగల్ విభాగం రాష్ట్ర కార్యదర్శిగా వెంకటరెడ్డి



పట్నంబజారు: వైఎస్సార్ సీపీ లీగల్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పోలూరి వెంకటరెడ్డి నియామకంపై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. అధికార ప్రతినిధిగా సయ్యద్‌బాబు షేక్, కార్యదర్శిగా కర్రి అబ్రహం లింకన్, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా జె.ఎలిజిబెత్‌రాణిలను నియమించారు. ఈనేపథ్యంలో న్యాయవాదులు అరండల్‌పేటలోని పోలూరి వెంకటరెడ్డి కార్యాలయంలో ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

విజయకీలాద్రిపై సుదర్శన హోమం

తాడేపల్లిరూరల్: స్థానిక సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారం మూడో రోజుకు చేరాయి. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో సుదర్శన హోమం నిర్వహించినట్లు తెలిపారు.

నాడు– నేడు పనులు వేగవంతం చేయాలి

- జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు
- సత్తెనపల్లిలో పాఠశాలల తనిఖీ



టెన్త్ విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వర్లు

సత్తెనపల్లి: రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు– నేడు పనులు వేగవంతం చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని పలు పాఠశాలలను గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పట్టణంలోని ఎంపీపీ పాఠశాల ఎస్ఆర్‌బీఎస్, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. నాడు– నేడు ఫేజ్–2లో జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో రూ. 57 లక్షలతో చేపట్టిన 14 గదుల నిర్మాణం, ఎంపీపీ ఎస్ఆర్‌బీఎస్ పాఠశాలలో రూ.12 లక్షలతో ఒక గది శ్లాబ్ పనులపై ఆరా తీశారు. పనులు వేగవంతం చేయాలని, నిధులు విడుదల అయ్యే విధంగా తాను చర్యలు తీసుకుంటానని చెప్పారు. గోరుముద్దను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–1 ఏ శ్రీనివాసరావు, ఎంఈఓ–2 ఏ రాఘవేంద్రరావు, జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జే మాధవీలత, సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లతా ప్రియదర్శిని, ఎస్ఆర్‌బీఎస్ ప్రధానోపాధ్యాయుడు ఖాదర్ మస్తాన్ ఉన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లో చోరీ

- ప్రయాణికురాలి బ్యాగ్ నుంచి 32 సవర్ల బంగారు ఆభరణాలు అపహరణ
- సీసీ ఫుటేజ్ ఆధారంగా నిందితుల కోసం గాలింపు

నరసరావుపేట టౌన్: ప్రయాణికురాలి బ్యాగ్‌లో బంగారు ఆభరణాలు అపహరణకు గురైన ఘటన గురువారం ఆర్టీసీ బస్టాండ్‌లో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలు.. వినుకొండ పట్టణానికి చెందిన షేక్ షెహనాజ్ చిలకలూరిపేట పట్టణం గుర్రాల చావిడిలోని సమీప బంధువుల ఇంట్లో జరిగే వివాహ వేడుకకు హాజరయ్యేందుకు బుధవారం వచ్చింది. తిరిగి స్వగ్రామం వెళ్లేందుకు చిలకలూరిపేటలో బస్సు ఎక్కి నరసరావుపేట ఆర్టీసీ బస్టాండ్‌లో దిగింది. వినుకొండ బస్సు ఎక్కి హ్యాండ్ బ్యాగ్‌లో చూసుకోగా ఉండాల్సిన బంగారు ఆభరణాలు కనిపించలేదు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సీఐ కృష్ణారెడ్డి సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకున్నారు. చోరీ జరిగిన తీరును బాధితురాలిని అడిగి తెలుసుకున్నారు. బ్యాగ్‌లో సుమారు 32 సవర్ల బంగారు ఆభరణాలు ఉన్నట్లు బాధితురాలు పోలీసులకు వివరించింది. బస్టాండ్‌లో సీసీ ఫ/టేజ్‌ను పరిశీలించారు. వినుకొండ బస్సు ఎక్కుతున్న సమయంలో ఇద్దరు మహిళలు బ్యాగ్‌లో ఆభరణాలు అపహరించినట్లు గుర్తించారు. దీంతో నిందితుల కోసం గాలిస్తున్నారు. ఈ మేరకు బాధితురాలిచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అద్భుతాల సృష్టికర్తలు ఇంజినీరింగ్ విద్యార్థులు

- సినీ డైరెక్టర్ బోయపాటి శ్రీను
- ఆర్‌వీఆర్‌జేసీలో ప్రారంభమైన కొలరిడో 2024 నేషనల్ ఫెస్ట్



గుంటూరు రూరల్: ప్రపంచంలో అద్భుతాలను సృష్టించేది ఇంజినీర్ విద్యార్థులేనని, క్రమ శిక్షణతో కూడిన విద్య ఉజ్వల భవిష్యత్తుకు నాంది పలుకుతుందని ప్రముఖ చలనచిత్ర దర్శకుడు బోయపాటి శ్రీను పేర్కొన్నారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం రెండు రోజుల పాటు కొలరిడో–2024 పేరుతో జరుగుతున్న నేషనల్ లెవెల్ టెక్నికల్, కల్చరల్, స్పోర్ట్స్ ఫెస్ట్‌లో యన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోయపాటి మాట్లాడుతూ తానూ కూడా జేకేసీ కళాశాల నుండే విద్యనభ్యసించానన్నారు. గురువులు నేర్పిన క్రమశిక్షణతోనే తాను ఎంచుకున్న రంగంలో ఉన్నత స్థానం రావడానికి కారణమైందన్నారు. ప్రతి విద్యార్థికి జీవితంలో ఎదురయ్యే సంఘటనలను ఆలోచనలతో బ్యాలెన్స్ చేసుకుంటేనే ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బోయపాటి శ్రీను ను కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సెక్రెటరీ కరస్పాండెంట్ ఆర్ గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు శాలువా కప్పి మెమెంటోను అందజేసి ఘనంగా సత్కరించారు. జాతీయ స్థాయిలో జరుగుతున్న ఈ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ రాష్ట్రాల నుంచి 5,100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

తెనాలి జిల్లా వైద్యశాలకు ప్రపంచ బ్యాంకు బృందం



సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణితో మాట్లాడుతున్న ప్రతినిధి బృందం సభ్యులు

తెనాలిఅర్బన్: ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం గురువారం తెనాలి జిల్లా వైద్యశాలను పరిశీలించింది. ఢిల్లీ నుంచి వచ్చిన సభ్యులు వైద్యశాలలోని సూపరింటెండెంట్ కార్యాలయానికి వచ్చారు. సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణితో వైద్యశాలకు సంబంధించిన వివరాలను సేకరించారు. అనంతరం జిల్లా వైద్యశాల, తల్లి పిల్లల వైద్యశాలను పరిశీలించి అక్కడ అందుతున్న సేవలపై ఆరా తీశారు. వైద్యశాలను బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ సౌభాగ్యవాణి మాట్లాడుతూ ప్రపంచ బ్యాంకు ప్రతినిధి బృందం మూడు రోజుల పాటు తెనాలిలో ఉంటారని చెప్పారు. జిల్లా వైద్యశాల, తల్లిపిల్లల వైద్యశాలలోని అన్ని విభాగాలను పరిశీలించి వారికి అవసరమైన వివరాలను సేకరిస్తారని చెప్పారు. ప్రభుత్వ సహకారంతో భవిష్యత్‌లో వైద్యశాలలను మరింత బలోపేతం చేసే అవకాశం ఉందన్నారు. హిందూపూర్, పార్వతీపురం, తెనాలిలోని వైద్యశాలలను వీరు పరిశీలిస్తారని చెప్పారు. వారి వెంట ఏవో డాక్టర్ ఎం.మజీదా బేగం, ఆర్‌ఎంవోలు షేక్ మస్తాన్‌వలీ, కె.సురేష్, వైద్యులు డాక్టర్ రమణయ్యరావు, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ వినీల్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.రాజేశ్వరి ఉన్నారు.

తెనాలిలో వివాహిత దారుణ హత్య

వివాహేతర సంబంధం నేపథ్యంలోనే...



అలేఖ్య(ఫైల్)

తెనాలిరూరల్: స్థానిక గంగానమ్మ పేటలోని భవనం వారి వీధిలో వివాహిత దారుణ హత్యకు గురైంది. ఇంట్లో భర్త, అత్త పిల్లలు ఉండగానే మరో గదిలో ఆమె విగత జీవిగా పడి ఉంది. దుండగుడు పదునైన వస్తువుతో పీక కోసి హతమార్చాడు. పోలీసుల కథనం ప్రకారం.. గంగానమ్మ పేటకు చెందిన రామిశెట్టి అలేఖ్య (35) బుధవారం రాత్రి ఇంటి పై గదిలో ఆమె భర్త రమేష్ అత్త ఉండగా కింద గదిలో నిద్రకు ఉపక్రమించింది. అయితే భర్త, బంధువులు ఉదయం చూసేసరికి గొంతు కోసి మృతి చెందిన స్థితిలో అలేఖ్య మృతదేహం నగ్నంగా పడి ఉంది. మృతురాలి భర్త టూ టౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ ఎ. సుధాకర్ మృతదేహాన్ని పరిశీలించారు. అలేఖ్య భర్త రామిశెట్టి రమేష్ చార్టెడ్ అకౌంటెంట్ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు. పెద్ద కుమారుడు అనారోగ్యంతో బాధపడుతుండగా అతడికి తరచూ బెంగుళూరు తీసుకువెళ్లి చికిత్స అందిస్తున్నారు. అలేఖ్యకు బాలాజీ రావుపేటకు చెందిన ఆటోడ్రైవర్ అన్నా శ్రీనివాసరావుతో కొంత కాలంగా వివాహేతర సంబంధం ఉన్నట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. వీరిరువురూ గతంలో ఒకసారి ఇంటి నుంచి వెళ్లిపోగా భర్త పోలీసులకు ఫిర్యాదు చేసి తిరిగి రప్పించుకున్నట్లు తెలుస్తోంది. కొన్ని సంవత్సరాలుగా శ్రీనివాసరావు తన భార్య అలేఖ్యని వేధిస్తున్నాడని, తనపై హత్యాయత్నం కూడా చేశాడని మృతురాలి భర్త రమేష్ మీడియా ఎదుట ఆరోపించారు. తమని చంపుతామని పలు మార్లు హెచ్చరికలు చేశాడని, దీనిపై కోర్టులో కేసులు నడుస్తున్నాయన్నారు. కోర్టు కేసుల్లో శ్రీనివాస్‌కి శిక్ష పడే అవకాశం ఉండటంతోనే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని వాపోయారు. హత్య విషయం తెలుసుకుని ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ సుధాకర్ తెలిపారు. తెల్లవారుజామునే హత్య జరిగినట్టు తెలుస్తోందని, పదునైన వస్తువుతో గొంతు కోయడంతో తీవ్రంగా రక్తస్రావమై మృతిచెందని చెప్పారు. కాగా బుధవారం అర్ధరాత్రి ఒంటరిగా గదిలో ఉన్న అలేఖ్య వద్దకు వచ్చిన శ్రీనివాస్ తెల్లవారుజాము వరకూ అక్కడే ఉండి అనంతరం ఇరువురి మధ్య జరిగిన ఘర్షణలో ఆమెను హత్య చేసి పరారైనట్లు భావిస్తున్నారు. మృతురాలి భర్తపై హత్యాయత్నం కేసులో శ్రీనివాసరావు నిందితుడిగా ఉన్నాడు. ఇదే కేసులో అలేఖ్య ప్రత్యక్ష సాక్షిగా ఉంది. త్వరలో కేసు కోర్టులో విచారణకు రానుండడంతో ఈ విషయంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగి హత్యకు దారి తీసి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. హంతకుడి ఆచూకీ గుర్తించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

భార్యను హతమార్చినందుకు జీవిత ఖైదు

నగరంపాలెం: భార్యను హతమార్చిన కేసులో భర్తకు జీవిత కాలం కఠిన కారాగార శిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ గుంటూరు జిల్లా ఐదో జడ్జి తీర్పు వెలువరించారు. ఈ కేసు వివరాలను జిల్లా ఎస్పీ తుషార్ డూడీ గురువారం వెల్లడించారు. స్థానిక ఏటి అగ్రహారం 12వ వీధికి చెందిన మాదాల సాంబశివరావుకు సంగడిగుంటకు తోట అరుణతో 2006లో పెళ్లైంది. వారికి ఇద్దరు మగ పిల్లలు. సాంబశివరావు కాంట్రాక్ట్ పద్ధతిలో మున్సిపాల్టీ నీటి ట్యాంకర్ డ్రైవర్‌గా, కూలీ పనులకు వెళ్లేవాడు. భార్య ఆర్టీసీ గుంటూరు –2 డిపోలో కండక్టర్ ఉద్యోగం చేస్తుండేది. అయితే భర్త చెడు అలవాట్లకు బానిసై డబ్బులు కోసం భార్యను వేధించే వాడు. అయితే భార్య ధరించే నల్లపూసల దండ కనిపించక పోవడంతో ఇద్దరి మధ్యా వాదనలు జరిగి భర్త గొడవపడేవాడు. అప్పటి నుంచి భార్యపై అనుమానం పెంచుకుని చంపాలని నిర్ణయించుకుని అవకాశం కోసం వేచి చూశాడు. 2018 నవంబర్ 29 రాత్రి తెల్లవారుజామున 4 గంటల సమయంలో భార్య నిద్రపోతుండగా చున్నీతో గొంతు నలిమి హతమార్చాడు. ఉదయం ఏమి తెలియనట్టు నటించగా సాంబశివరావుపై అనుమానం వ్యక్తం చేస్తూ బంధువుల, స్థానికులు నగరంపాలెం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసిన అప్పటి స్టేషన్ ఇన్‌చార్జ్ సీఐ వై.శ్రీనివాస రావు మాదాలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. జిల్లా ఐదో అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి కోర్టులో ఈ కేసు విచారణకు వచ్చి నేరం రుజువు కావడంతో జిల్లా ఐదో అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి నిందితుడికి జీవిత కాలం కఠిన కారాగార శిక్షతోపాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు.